## 108

# గడయెక్కినా, గడప గడపెక్కినా...

"ఇప్పుడంటే పిదప కాలమొచ్చి, అన్నీ ఇలా ఆర్చుకుపోతున్నాయి గానీ, నా చిన్నతనంలో రోజులు యిలా వుండేవి కాదండీ."

డోలుతాడును బిగిస్తూనే తన అసంతృప్తిని తెలియజేసింది రాములమ్మ. ఆ తరువాత పది, పదిహేను నిమిషాలదాకా రాములమ్మ మాట్లాడలేదు. డోలుతాడును బిగిస్తూ మధ్య మద్య, చర్మాన్ని మోగించి, శృతి సరిపోయిందో లేదో చూసుకొంటూ, మరీ హెచ్చుగా ఉన్నప్పుడు, తాడును వదులు చేస్తూ, బోలుగా శబ్దం వొస్తున్నప్పుడు పళ్ళు బిగించి, ఒక్క ముక్కతో తాడును బిగించుతూ కాలక్షేపం చేసింది రాములమ్మ.

ఎండ మిటమిటలాడుతోంది. కాలవలోంచి మురుగునీరు వాసన, ఆ ప్రాంతాన్ని ఉక్కిరిబిక్కిరిచేస్తోంది. గోడవారగా వున్న పొయ్యి మండకుండా పొగల్ని కక్కుతోంది. రాములమ్మ చేస్తున్నపని అయిపోయిందేమో, మరొక్కసారి అనుమానం తీర్చుకొనేందుకు డోలును మోగించి చూసుకుంది. ఆ మోత సంతృప్తికరంగా ఉందిగావును, ఆ డోలును ఆసింటా వుంచి, చెమట తుడుచుకొని వో లోటాడు నీల్ళు తాగి గొంతు సవరించుకొంది. సవరించుకొని చెప్పడం ప్రారంభించింది.

మీకూ, నాకూ ఓ జిల్లా వుంది. ఓ ఊరుంది. ఆ ఊళ్ళో, సొంతానిదో అద్దెదో వో యిల్లుంది. మీతోనూ, నాతోనూ పని వున్నవారికి ఫలానా చోటికివస్తే, ఫలానా అప్పుడు దొరుకుతారు అన్న నమ్మకం వుంది. కానీ రాములమ్మకు అటువంటి చిరునామా అన్నదే లేదు.

అర్ధశతాబ్దం క్రిందట, కృష్ణా గుంటూరు జిల్లాలవారికి పోతులదానప్ప పేరు చెబితే ఎగిరిగంతేసేవారు. గుమ్మడి కాయంత జుట్టుముడి, మొలకు బిళ్ళ మొలతాడు, పట్టెవర్ధనాలు, మెళ్ళో పూసల పేర్లూ, నిమ్మకాయలల్నయినా చులాగ్గా నిలబెట్టగలిగినంత పెద్ద పెద్ద మీసాలతో, బండి జల్లంత శరీరంలో, దానప్ప కాస్తంత భయంకరంగానే వుండేవాడు. కానీ, ఆకారంలోనే తప్ప దానప్ప అంతరంగంలో భయపడవలసిందేమీ లేదు.

"దానప్ప మా అయ్యేనండీ! మీదేవూరు... అయితే మీకు తెలిసే వుండాలే, కనీసం విన్నైనా వుండాలే! మీకు గాకపోతే మీ అయ్యనడగండి. లేకపోతే మీ తాతనడగండి- మా అయ్యను గురించే చెబుతారు" అన్నది రాములమ్మ. దానప్ప ఆటంటే, జనం విరగబడి వచ్చేవారు.పిల్లా జెల్లాతో, ఊరు ఊరంతా తీర్థానికి కదిలినట్లు కదిలివచ్చేది. పక్కా రెండుగంటల సేపు జరిగే ఆ ఆట ముగిసేదాకా జనం కదిలేవారే కారు.

ఈనాడు మనం పేరుపొందని సర్కసుల్లో చూసే చాలా ఫీట్సును దాసప్ప ఆ రోజుల్లో చులాగ్గా చేసిపారేసేవాడు.

"రెండు కత్తుల్ని ఎగరేసి మీరు పట్టుకుంటారా? మీ సర్కసువాళ్ళు ఆరేడు, ఎనిమిది కత్తులు ఎగరేస్తుంటేనే మీరు ఆహా, ఓహో అని ఆశ్చర్యపడతారు. మా అయ్య పన్నెండు కత్తుల్ని ఎగరేసేవాడు. నేను మా అయ్యకు కత్తుల్ని అందించేదాన్ని" అన్నది రాములమ్మ. ఆ కత్తులయినా బండవీ,

మొండివీకావు. వేస్తే వేయి రూపులుగా వుండేవి. అనుమానమున్న వాళ్ళు ఆ కత్తుల్ని పరీక్షకూడా చేసేవాళ్లు. పన్నెండు కత్తులెగరేసినా చేతికి గాటు కూడా పడేది కాదు.

"ఒకసారి మాకూ, ఇంకో ముఠాకూ పందెం పడింది. అవతలి ముఠావాడు కూడా పన్నెండు కత్తుల్ని ఎగరేశాడు. మా అయ్యకు రోషం వచ్చింది. కళ్ళు నిప్పుకణాల్లాగా అయ్యాయి. ఏదయితే అదే అవుతుందని పధ్నాలుగు కత్తులూ తీసుకొని ఎగరేశాడు. జనం చప్పట్లు కొట్టి కేకలు వేశారు. ఈ పని అవతలివాడు చెయ్యలేకపోయాడు" అన్నది రాములమ్మ.

ఆవిడకూడా చిన్నప్పుడు మొగ్గలేసేది. సన్నని ఇనుప చక్రం లోంచి దూరి వచ్చేది; ఎనిమిది బంతుల్ని ఏకతాకీన ఎగరేసేది.

రాములమ్మకున్న పేరు బంతులు ఎగరేయడంలో కాదు; గడకర్రమీద ఆడడంలో. ఆ రోజుల్లో రాములమ్మ గడాట అంటే, అప్పటి కుర్రకారు అక్షరాలా పడిచచ్చేవారు(ట). బాగా ముదిరి చేవదేలి. పండుబారిన బొంగును ఎన్నుకునేవారు. ఆ వెదురుకు ప్రతి గనుపు దగ్గరా బిల్లలుండాలి. బిల్లల్ని జానెడు పొడవుంచి నున్నగా చివ్వేవారు. ఈ బిల్లలు గడకు రెండువేపులా, గడ చివరి దాకా వుండాలి.

"అలాంటి గడను, మైదానంలో, లోతుగా పాతేస్తారు. గడకు ఎనిమిది వేపులా ఎనిమిది పగ్గాలు కట్టి, ఆ పగ్గాలను దూరంగా తీసుకుపోయి దగ్గరున్న చెట్లకో, రాళ్ళకో, పాతిన గడ్డపారకో బిగిస్తారండీ, గడ కదలకూడదుగదండీ! నేను చెడ్డీ కట్టుకుని గడమీదకెక్కేదాన్ని. గడ చివర చిన్న 'బొడ్డు' వుంటుందండీ. నేనేమో నడుముకో బొడ్డుపీటకట్టుకొనేదాన్ని. ఈ పీటమధ్య చిన్న గుంట ఉంటుంది. వెదురు బొడ్డు ఈ గుంటలోకొచ్చేలాగా సర్దుకొనేదాన్ని, మొదటిసారి మాత్రం బిల్లపట్టుకొని తిరిగేదాన్ని. అంతే, ఆ తరువాత నా అంతట నేనే ఊపుతెచ్చుకొని తిరిగేదాన్ని... మొదట్లోకాస్త భయంగానే ఉండేదనుకోండి. ఆ తరువాత అదీ వుండేది కాదు. పక్కా అరగంట తిరిగేదాన్ని ఆగిన తరువాత; చేతుల్తో గడను పట్టుకోకుండా కాళ్ళతో బిల్లల్నివడేసుకొంటూ కిందికొచ్చేదాన్ని. ఇక తాడుమీద నడవడం నాకో లెఖ్ఖలోదేకాదు"అన్నది రాములమ్మ.

ఆ రోజులు పోయాయని ఇప్పుడా ఆటలు చూసే జనం కూడా లేరనీ వాపోయింది రాములమ్మ.

"అయినా కులవృత్తిని వదల్లేము బిడ్డ! పండగలకీ, పబ్బాలకి ఏదో మామూల పల్లెలకు వెళ్ళి ఆటాడి వస్తుంటారు. మా వాళ్ళు చాలా మంది ఆ పనుల్లోకి ఈ పనుల్లోకి పోతున్నారు. ఒక ఊరేముంది? ఒక పేటేముంది?రోజుకో వూరు తిరుగుతుండేవాళ్ళం. ఆ రోజుల్లో రూపాయి కనబడితే సంబరంగా వుండేది. అన్నీ గింజలే బిడ్డ సంచులు నిండిపోయేవి. మాకు మూడు గాడిదలు కూడా వున్నాయ్. సామానంతా వాటి మీద పడేసి ముందే వూరొస్తుందో కూడా తెలియకుండా ప్రయాణించిన రోజులున్నాయి."

ఏం ఆడినా, ఏం పాడినా, ఆస్తుబిస్తేతప్ప గుండె నిబ్బరం ఎప్పుడూ లేదన్నది రాముల్మ. "అప్పుడు ధర్మ ప్రభువులు వున్నారు. ఇప్పుడేముంది బిడ్డా? అంతా." అని బూతుమాట విసిరింది రాములమ్మ.

చుట్టూ వున్నవారంతా తన బిడ్డలు కారనీ, తన కొడుకుబిడ్డలూ, కూతురు బిడ్డలు కూడా ఉ

న్నారనీ, పేరు పేరు పిలిచి పరిచయం చేసిందామె.

"మా అయ్యతో పోలిస్తే నాకేమీ ఆట రానట్టే లెక్క. సన్నాసులున్నారే బిడ్డ నాకన్నా పనికిమాలినోళ్ళు" అని చిన్న మనవణ్ణి దగ్గరకు తీసుకుంది.

వీళ్ళకు చదువుకోవాలనే వున్నదనీ, కానీ ఎక్కడా స్థిరంగా వుండక పోవడం చేత బళ్ళోకి పంపే అవకాశం లేదని అన్నది రాములమ్మ.

ఏలినవారు ఈ సంచార జాతుల సంక్షేమం కోసం ఏవేవో చేస్తున్నామంటున్నారు. ఆ చేసేదేమిటో వీరిదాకా వస్తే, కాస్త వెసులుబాటు దొరకవచ్చు కారీ. ప్రభువులు చేయాలిగదా!